క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోండి

లబ్బీపేట(విజయవాడతూర్పు):భారత రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ సమాన ఓటు హక్కు కల్పించి, ప్రభుత్వాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే అవకాశం కల్పించారని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములైన ఓటు హక్కును వినియోగించుకోవాలని వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వట్టిపల్లి రామస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాలకు సమానంగా ఓటు హక్కు కల్పించారని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన దేశాన్ని, రాష్ట్రాలను ప్రగతి పథంలో పరుగులెత్తించే, ప్రజాస్వామ్య విలువలు గల ప్రభుత్వాలను ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారా మనకు కల్పించారన్నారు. ఓటు అనే ఆయుధం ద్వారా ప్రజలందరికీ ముఖ్యంగా కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, వ్యాపారులు, మేధావులు, విద్యార్థులు, యువత, అన్ని కులాలు, అన్ని మతాల వారు, అన్ని వర్గాల వారు తలెత్తుకుని జీవించే విధంగా ఉండే ప్రభుత్వాలను ఎన్నుకుందామని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కాపాడే మంచి ప్రభుత్వాలను మనమే ఏర్పాటు చేసుకుందామని ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

కృష్ణలంక(విజయవాడతూర్పు):ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకొని మంచి ప్రజా నాయకులను ఎన్నుకొని రాష్ట్ర, దేశాభివృద్ధికి పాటుపడాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు డేరంగుల ఉదయ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఓటు హక్కు ఎంతో గొప్ప ఆయుధమని, దాని విలువ ఎనలేనిదన్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటు అనే రెండక్షరాలు దేశ చరిత్రనే మార్చేస్తుందన్నారు. కొంతమంది దాని విలువ తెలియక వినియోగించుకోవడం లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలి, సమాజం పురోగతి సాధించాలి, మనం బాగుపడాలి అనే తాపత్రయం ఉండడమే కాదు ఓటూ ముఖ్యమేనన్నారు. అందుకే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించే సాధారణ ఎన్నికల్లో నిత్యం రాష్ట్ర సంక్షేమాభివృద్ధిని కాంక్షించే రాజకీయ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

తూర్పులో పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 53 పోలింగ్ కేంద్రాలు
- 298 బూత్‌లలో పోలింగ్ నిర్వహణ
- మొత్తం ఓటర్లు 2,70, 624 మంది
- ఎన్ఎస్ఎం స్కూల్ నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది



విజయవాడ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్లో తూర్పు నియోజకవర్గానికి చెందిన పోలింగ్ సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): సాధారణ ఎన్నికలు 2024 పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. తూర్పు నియోజకవర్గంలో 2,70,624 మంది ఓటర్లు ఉండగా, 53 పోలింగ్ కేంద్రాలు, 298 బూత్‌లలో సోమవారం పోలింగ్ జరగనుంది. తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అంతా ఆదివారం పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంలు, వీవీపాట్‌లతో పాటు, పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని అందజేశారు.

ఎన్నికల విధుల్లో 1788 మంది సిబ్బంది..

తూర్పు నియోజకవర్గంలో 298 బూత్‌లు ఉండగా, ఆయా బూత్‌లలో ఎన్నికల నిర్వాహణకు 1788 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ప్రతి బూత్‌లో ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ప్రతిబూత్‌లో ప్రిసైడింగ్ అధికారి ఒకరు, ఏపీఓ ఒకరు, నలుగురు ఓపీఓలు ఉంటారు. ఇలా 298 మంది పీఓలు, 298 మంది ఏపీఓలు, 1192 మంది ఓపీఓలు విధులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నారు.

ఎక్కువ బూత్‌లు ఉన్న కేంద్రాలివే..

నియోజకవర్గంలో 2,70,624 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,32, 441 మంది, స్త్రీలు 1,38,160 మంది, ఇతరులు 23 మంది ఉన్నారు. వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు 298 బూత్‌లు, 53 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 17వ పోలింగ్ బూత్ కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం స్కూల్‌లో ఏర్పాటు చేయగా, ఆ తర్వాత పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్‌లో 15 పోలింగ్ బూత్, పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య బాలికల జిల్లా పరిషత్ స్కూల్‌లో 14 బూత్, ఆంధ్రా లయోలా కళాశాలలో 13 పోలింగ్ బూత్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో 11 బూత్, మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే మున్సిపల్ స్కూల్, కృష్ణలంకలోని వంగవీటి మోహనరంగ మున్సిపల్ స్కూల్, యనమలకుదురు రోడ్డులోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్, పటమటలోని కోనేరు బసవపున్నయ్య జెడ్పీ స్కూల్‌లో 10 బూత్‌లు చొప్పున ఏర్పాటు చేశారు. అతి తక్కువగా చలసాని నగర్‌లోని ఓడీఏ కమ్యునిటీ హాల్‌లో , చుట్టుగుంటలోని చతుర్వేది ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఒక్కో బూత్ ఏర్పాటు చేశారు. కాగా ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కానుండగా, 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. అందులో ఇవీఎంలు, వీవీపాట్‌లు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించిన తర్వాత వాటికి ఏజెంట్ల సమక్షంలో సీల్‌వేసి పోలింగ్‌ను ప్రారంభిస్తారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత..

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్లు, 200 మీటర్లు దూరంగా మార్కింగ్ చేశారు. ఓటు వేసేందుకు వచ్చే వారు మినహా ఇతరులు వస్తే చర్యలు తీసుకోనున్నారు. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేసేందుకు ఇప్పటికే జిల్లా ఎన్నికలు అధికారులు చర్యలు తీసుకున్నారు. అదనపు పోలీసు బలగాలతో పాటు ఫ్లెయింగ్ స్క్వాడ్స్, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



ఈవీఎంలను తనిఖీ చేస్తున్న అధికారులు



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న ఉద్యోగులు



బస్సులో పోలింగ్ కేంద్రాలకు పయనమైన ఎన్నికల సిబ్బంది

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో అధికారులు ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు, యువతుల కోసం పింక్ పోలింగ్ బూత్‌ను అందంగా అలంకరించారు. అలానే దివ్యాంగులు తేలికగా ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ బూత్ సిద్ధం చేశారు. రద్దీగా ఉండే ఓటర్లు వేచి ఉండేందుకు సైతం కుర్చీలు అందుబాటులో ఉంచారు. అధికారులు ఓటర్ల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఓటర్లు వేచి ఉండేందుకు చేసిన ఏర్పాట్లు



నిర్మల కాన్వెంట్‌లో విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్



లయోలా కళాశాలలో మహిళల కోసం ఏర్పాటుచేసిన పింక్ పోలింగ్ బూత్

ముంపు నుంచి విముక్తి

లబ్బీపేట(విజయవాడ తూర్పు): దశాబ్దాలుగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఉన్న దేవినేని అవినాష్ పరిష్కరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పేదలు నివసించే ప్రాంతాల్లో వసతులు లేక అల్లాడిపోతున్న పరిస్థితుల్లో కోట్లాది రూపాయల ఖర్చు పెట్టి ఎన్నో సదుపాయాలు కల్పించారు. రహదారులు, డ్రెయిన్లు, కొండ మార్గాల్లో శిథిలమైన మెట్ల నిర్మాణాలు ఇలా ఒకటేమిటి ఎన్నో రకాల సమస్యల నుంచి ప్రజలకు విముక్తి లభించింది. కృష్ణానది ఒడ్డున నివసిస్తున్న ప్రజలకు వరద ముప్పు నుంచి రక్షణ కల్పించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించారు. దీని వల్ల వేలాది మంది ప్రజలు సురక్షితంగా జీవించగలుగుతున్నారు.



కృష్ణానది రిటైనింగ్ వాల్

దశాబ్దాల కల నెరవేరింది



మేము నాలుగు దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో ఉంటున్నాం. భ్రమరాంబపురం శ్మశాన భూమిలో ఇళ్లు ఏర్పాటు చేసుకున్నాం. ఆ స్థలాల్లో కొన్నింటికి బీ ఫారం పట్టాలు ఇచ్చారు. ఆ స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలని ఎప్పుడు నుంచో కోరుతున్నాం. ఆ కల నెరవేరింది. మా ఇళ్ల పట్టాలు క్రమబద్ధీకరణకు లైన్ క్లియర్ కావడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు మేము అధికారికంగా ఇళ్లు నిర్మించుకోవచ్చు. క్రయ విక్రయాలు జరుపుకుని, రిజిస్ట్రేషన్‌లు కూడా చేసుకోవచ్చు.

–సింగంపల్లి శ్రీనివాసరావు, భ్రమరాంబపురం

రోడ్లు బాగుపడ్డాయి



ఒకప్పుడు మా ప్రాంతంలో రోడ్లుపై వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. గోతులమయంగా ఉండటంతో పాటు, వర్షం వస్తే నీళ్లు నిలిచేవి. ఇప్పుడు రోడ్లు బాగుపడ్డాయి. మా ప్రాంతంలో అన్నీ సిమెంటు రోడ్లు వేశారు. అంతేకాకుండా విద్యుత్ లో వోల్టేజీ సమస్యను పరిష్కరించారు. మోడల్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో ఇప్పుడు విద్యుత్ కష్టాలు కూడా తీరాయి. దీంతో చాలా సంతోషంగా ఉన్నాం.

–నరేష్, అయ్యప్పనగర్

మాకు ముంపు సమస్య తప్పింది



మేము ఎంతో కాలంలో కృష్ణానది ఒడ్డున నివాసం ఉంటున్నాం. వరదలు వచ్చినప్పుడల్లా ఇళ్లలోకి నీరు రావడంతో, ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకునే వాళ్లం. అలా వారం, పది రోజుల పాటు అక్కడే ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు మాకు భయం లేదు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో రక్షణ కవచం ఏర్పడింది. వరదలు వచ్చినా, హాయిగా సంతోషంగా ఇంట్లోనే ఉంటాం. పది లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా మా ఇళ్లలోకి నీరు చేరదు.

–నాగలక్ష్మి, రణదీవెనగర్